ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

కెరమెరి: పరీక్ష సెంటర్ నుంచి బయటికి వస్తున్న ఇంటర్ విద్యార్థులు

వాంకిడి:పెన్నులతో షర్టులపై ఐ మిస్ యూ రా అని రాసుకుంటున్న స్నేహితులు

కెరమెరి, మార్చి 14: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. కెరమెరితో పాటు మోడిలోని కేజీబీవీ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 146 మందికి 140, ద్వితీయ సంవత్సరంలో 158 మందికి 156 మంది హాజరైనట్లు సీఎస్ పరశురాములు, డీవో సునీల్ కుమార్ తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు వెల్లడించారు.

వాంకిడి, మార్చి14: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియార్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు చివరి రోజు 188మంది విద్యార్థులకు 184మంది హాజరై, నలుగురు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తెలిపారు. పరీక్షలు ముగి యడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు పెట్టారు.

జైనూరు, మార్చి14: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఎలాంటి కాపీయింగ్ లేకుండా పోలీస్ బందోబస్తులో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు వెల్లడించారు.

కౌటాల, మార్చి 14: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షల్లో 299 మంది విద్యార్థులకు గాను 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 289 మంది పరీక్షలు రాసినట్లు సీఎస్ బాలకిషన్‌రావు, డీవో దౌలత్ తెలిపారు.

దహెగాం, మార్చి14: గత నెల 28న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిసినట్లు ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు.సెకండియర్‌లో 128 మంది విద్యార్థులకు గాను 122 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

రెబ్బెన, మార్చి 14: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలు ముగిసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రకాశ్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం, ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం పూర్తయ్యాయని చెప్పారు. వొకేషనల్ పరీక్షలు ఈ నెల 16న ముగియనున్నట్లు పేర్కొన్నారు.

పత్తిసాగుపై అవగాహన కలిగి ఉండాలి

- కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ
- పత్తి సాగుపై పవర్ ప్రజెంటేషన్

మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ

ఆసిఫాబాద్ టౌన్, మార్చి14: అధిక సాంద్రతలో పత్తి సాగుపై అధికారులు, రైతులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శివ కృష్ణ సూచించారు. గురువారం జిల్లా కేంద్రం లోని జనకాపూర్ రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సిర్పూర్ (యూ) డివిజన్ పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు పత్తి సాగుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం జాతీయ ప్రత్తి పరిశోధనా కేంద్రం, నాగపూర్ సహకారంతో మంచిర్యాల జిల్లాలో 165 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు చేశారని గుర్తు చేశారు. నేలల రకాలు, విత్తన మోతాదు, విత్తే దూరం, మొక్కల సంఖ్య, అందుబాటులో ఉన్న రకాలు, పెరుగుదలను నియంత్రించే ఉత్ప్రేరకాల వాడకం, పోషకాల యాజమాన్యం, కలుపు, చీడపీడల యాజమాన్యంపై సమగ్రంగా వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో యాసంగి వరి పంటలో సల్ఫైడ్ దుష్ప్రభావం, జింకు లోపం, కాండం తొలుచు పురుగు ఉనికిని గుర్తించామని చెప్పారు. సరైన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ శ్రీధర్ సిద్ధి మాట్లాడుతూ వరి సాగుచేసే రైతులు రకాల ఎంపికలో జాగ్రత్తలు వహించాలని, పంటకాలానికనుగుణంగా మొక్కల సాంద్రత సరిగా ఉండేలా దగ్గర దగ్గరగా నాటుకోవాలని సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జగిత్యాల మృత్తికా శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ యాసంగిలో వరి పంటసాగు చేసే రైతులు జింక్ లోపం సల్ఫైడ్ దుష్ప్రభావం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు మాట్లాడుతూ అధిక సాంద్రత ప్రత్తి సాగుపైన ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సాగు విధానంపైన దృష్టి సారించి అధిక విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతి, నాగరాజు, మండల వ్యవసాయాధికారి మంజుల, విస్తరణాధికారి రాకేశ్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యాభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా నోడల్ అధికారి నైతం శంకర్‌ను సన్మానిస్తున్న తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 సభ్యులు

- జిల్లా నోడల్ అధికారి నైతం శంకర్

ఆసిఫాబాద్ టౌన్, మార్చి14: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అధ్యాపకులకు సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ముగిసిన నేపథ్యంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్- 475 సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తి చేసినందుకు అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్ అయిన తర్వాత వచ్చిన మొదటి పరీక్షలు విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీజేఎల్ఏ -475 రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్కాకుల సంతోష్, కమిటీ సభ్యుడు అమరేందర్ రెడ్డి, అధ్యాపకుడు ఉప్పరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు
- కలెక్టరేట్‌లో పీస్ కమిటీ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు

ఆసిఫాబాద్‌టౌన్, మార్చి 14: అన్ని పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్యతో కలిసి ముస్లిం మతపెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైనందున ప్రజలందరూ మత సామరస్యంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మసీదుల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని, ప్రార్థనా సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో పాటు తాగునీటి ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాయంత్రం ప్రార్థనా సమయంలో పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహించాలని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి మైనారిటీ సంక్షేమ శాఖాధికారి సజీవన్, ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

15న జిల్లాకు రాష్ట్ర మంత్రి సీతక్క రాక

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 14: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఈ నెల 15న జిల్లాకు రానున్నారని మినిస్టర్ పీఏ సతీశ్ బండారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.15 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ ప్రారంభం, 7.45 గంటలకు గుండి పెద్ద వాగు వంతెనను పరిశీలన, 9 గంటలకు కెరమెరి మండలం జోడేఘాట్ లోని కొమురం భీం గిరిజన మ్యూజియంను సందర్శిస్తారని వెల్లడించారు. జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఈ నెల 15న వాహనాల వేలం

ఆసిఫాబాద్ టౌన్, మార్చి14: జిల్లాలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 15న జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ సమక్షంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏప్రిల్ 7 వరకు నీటి విడుదల

ఆసిఫాబాద్ టౌన్,మార్చి14: జనవరిలో నిర్వహించిన వారబందీ ప్రకారం జనవరి 7 నుంచి ఏప్రిల్ 7 వరకు రబీ పంట కోసం సాగునీటి విడుదల చేస్తున్నట్లు వట్టి వాగు ప్రాజెక్ట్ ఏఈ షేక్‌జానీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగు నీరు వారబందీ ప్రణాళిక ప్రకారం ఏప్రిల్ 7న సాగు నీటి విడుదల నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఆయకట్టుదారులు గమనించి పంటలను కాపాడుకోవాలని సూచించారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

బెజ్జూర్, మార్చి 14 : ఈ నెలాఖరు వరకు ప్రతి జీపీలో ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని ఎంపీవో రమేశ్ రెడ్డి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

వాంకిడి,మార్చి14:కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల వైద్యారోగ్య విస్తరణ అధికారి రవిదాస్ పేర్కొన్నారు. కుష్ఠువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బెండార, బనార్ కొసార, బంబార ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య విస్తరణ అధికారి రవిదాస్ మాట్లాడుతూ వ్యాధిని ప్రాథమికదశలోనే గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. 2027 నాటికి కుష్ఠు రహిత సమాజంకోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. వైద్యసిబ్బంది మమత, ఏఎన్ఎం సునంద, ఆశ కార్యకర్త ఉన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ

రెబ్బెన, మార్చి 14: గంగాపూర్ జడ్పీ హైస్కూల్లో మూడు నెలల కరాటే శిక్షణ గురువారంతో ముగిసినట్లు మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి బాలికలకు మూడు నెలల నుంచి శిక్షణ ఇవ్వగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారన్నారు.

ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి

పెంచికల్ పేట్,మార్చి14 విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని జిల్లా ప్రత్యేకాధికారి సుధాకర్ పేర్కొన్నారు. గురువారం ఎల్లూరు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తొందరపడకుండా సమయసారిణి ఆధారంగా ముందుగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలని సూచించారు. పంచి ఫలితాలు సాధించి పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఏటీడీవో కమ్మర్ హుస్సేన్‌తో కలిసి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పరీక్ష సామగ్రి, చేతి గడియారాలను అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వాంకిడి, మార్చి14: సమేల గ్రామంలో గురువారం సీసీ ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ ప్రారంభించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ కిషన్, సమేల రమేశ్, మాజీ సర్పంచ్ మారుతి, గ్రామ పటేల్ గుర్నులే వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం కేటాయించాలి

వాంకిడి,మార్చి14:మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇష్టమున్నట్టుగా వాహనాలు పార్కింగ్ చేయడంతో పోలీసులు ఫోటోలు తీసి నో పార్కింగ్ చలాన్లు వేస్తున్నారు. వాహనదారులు ఆ చలాన్లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంక్ ఆవరణ, హైవే పక్కన, జెడ్పీఎస్ఎస్ ముందర ఇలా ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి వాహనాలు నిలుపుటకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫఐ) జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి

రెబ్బెన, మార్చి 14: రైతులు వ్యవసాయశాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. రెబ్బెన, నక్కలగూడ గ్రామాల పరిధిలో గురువారం వరి పంటలను వ్యవసాయశాఖాధికారులు, జగిత్యాల ఆర్ఏఆర్ఎస్, కేవీకే బెల్లంపల్లి సైంటిస్టులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, రసాయన ఎరువులు తగు మోతాదులో వాడాలని సూచించారు. రెబ్బెన ఏవో మంజుల, ఏఈవో రాకేశ్, సైంటిస్టుల బృందం ఉన్నారు.

'విద్యాభారతి' సేవలు అభినందనీయం

గురుకుల పాఠశాలకు జిల్లా విద్యాధికారి అశోక్ చేతులమీదుగా మార్చ్ ఫాస్ట్ బ్యాండ్ విరాళంగా ఇస్తున్న విద్యా భారతి బలగం సొసైటీ సభ్యులు

- జిల్లా విద్యాధికారి అశోక్

ఆసిఫాబాద్ టౌన్, మార్చి14: విద్యా భారతి బలగం సొసైటీ సేవలు అభినందనీయమని జిల్లా విద్యాధికారి అశోక్ కొనియాడారు. గురువారం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఆసిఫాబాద్‌కు విద్యాభారతి విద్యాసంస్థలు-విద్యాభారతి బలగం సొసైటీ వారు రూ.9500 విలువగల మార్చ్ ఫాస్ట్ బ్యాండ్‌ను జిల్లా విద్యాధికారి అశోక్ చేతుల మీదుగా విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యాభారతి బలగం సొసైటీ తాండూర్, మంచిర్యాల జిల్లా వారు గతంలో కూడా ఈ పాఠశాలకు ఆర్థిక సహాయం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు సురభి ఆగమరావు, గౌరవాధ్యక్షుడు పెండ్యాల రాధాకృష్ణ, కార్యదర్శి తొగరు శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సకల వసతులతో సిద్ధం చేయాలి

కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

- రాష్ట్రప్రభుత్వ సీఎస్ శాంతికుమారి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్ టౌన్,మార్చి 14: వచ్చే విద్యా సంవత్సరం-2024-25 ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలను పూర్తి స్థాయి సౌకర్యాలతో సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. గురువారం విద్యాశాఖ కార్యదర్శితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్య, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు ఉంటాయన్నారు. ఈ విద్యా సంవత్సరం ముగింపు అనంతరం వేసవి సెలవులు 45 రోజుల పాటు ఉంటాయని, ఈ క్రమంలో పాఠశాలలల్లో అవసరమైన మరమ్మతులు చేయడంతో పాటు సౌకర్యాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ సకాలంలో జరిగే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా విద్యాధికారి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ముగింపు అనంతరం వేసవి సెలవుల సమయంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూత్రశాలలు, వంటశాల, భోజనశాల, తాగునీటి ట్యాంక్ నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేసేందుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పంపిణీకి స్వయం సహాయక సంఘాలు, స్థానిక దర్జీలతో ఒప్పందం చేసుకోవడంతో పాటు విద్యార్థుల కొలతలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి రవీందర్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాకు రాష్ట్రస్థాయి అవార్డు

రాష్ట్రస్థాయి ఉమెన్స్ అచీవర్స్ అవార్డు తీసుకుంటున్న లట్ పటేల్ నీలాబాయి

జైనూరు,మార్చి14: మండలంలోని జామిని గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా లట్ పటేల్ నీలాబాయి గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి అవార్డు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్స్ అచీవర్స్ - 2024లో భాగంగా నీలాబాయికి రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి అవార్డు అందజేశారు.

బాధితులకు బాసటగా నిలువాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- భరోసా సెంటర్ తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ టౌన్,మార్చి14: సమాజంలో వివిధ రకాలుగా వంచించబడిన బాధితులకు అనునిత్యం బాసటగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. మహిళల భద్రతకు ప్రాముఖ్యతనిస్తూ మహిళలు, పిల్లల సమస్యల తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా సెంటర్ ఏర్పాటు చేశారని వివరించారు. ఫిర్యాదు అందిన వెంటనే బాధితులకు సత్వర న్యాయం చేసే దిశగా పనిచేయాలని తెలిపారు. అనంతరం సంబంధిత రికార్డ్స్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, టాస్క్ ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన గనుల పరిశీలన

గోలేటి జీఎం కార్యాలయంలో గనులను పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన, మార్చి 14: బెల్లంపల్లి ఏరియాలో మూతపడిన బొగ్గు గనులను గురువారం డాక్టర్ సుదీప్తా మహోపాధ్యాయ్ (ప్రొఫెసర్ ఐఐఈఎస్‌టీ శిబ్‌పూర్ కోల్‌కతా), కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ అధికారులతో కలిసి పవర్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి తెలిపారు. గోలేటి జీఎం కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మూతపడిన గనులు, మినిస్ట్రీ ఆఫ్ కోల్ నియమాలు, తాత్కాలిక గనుల మూసివేత ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ అడిషనల్ మేనేజర్ వెంకటరమణ, కార్పొరేట్ సర్వే అధికారి నరేశ్, డీజీఎం(ఈఅండ్ఎం) కృష్ణమూర్తి, బీపీఏవోసీపీ మేనేజర్ మహేశ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మహాదేవ జాతర కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న జాతర కమిటీ సభ్యులు

సిర్పూర్(యూ), మార్చి 14 :మండల కేంద్రంలో మూడు రోజులుగా సాగుతున్న మహాదేవ్ జాతర కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. మొదటి బహుమతి గెలుపొందిన డీఆర్ డిపో సిర్పూర్ కబడ్డీ జట్టుకు రూ.30.001,రెండో బహుమతి గెలుపొందిన టీఎంఆర్ కెరమెరి కబడ్డీ జట్టుకు రూ.15.001, మూడో బహుమతి గెలుపొందిన నిసని కబడ్డీ జట్టుకు రూ.5.001 బహుమతులు మహాదేవ్ జాతర కమిటీ చైర్మన్ ఆత్రం దౌలత్‌రావ్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ వైస్ చైర్మన్ సెడ్మకి బాపురావ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్, మాజీ సర్పంచులు మెస్రం భూపతి, పెందోర్ నాగోరావ్, మాజీ ఉప సర్పంచులు ఆత్రం ప్రకాశ్, హమీద్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

తుంగెడ ప్రభుత్వ పాఠశాలలో కుర్చీలు అందజేస్తున్న కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి

రెబ్బెన, మార్చి 14: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి సూచించారు. తుంగెడ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో గురువారం తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలు అందజేసి మాట్లాడారు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లింగన్న, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్, డిప్యూటి మేనేజర్ రాకేశ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఝాన్సీ లక్ష్మి, ప్లాంటేషన్ వాచర్ గంగయ్య, ఉపాధ్యాయురాలు వనిత ఉన్నారు.